ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శుక్రవారం 16 మే 2025

జవాన్లకు మద్దతుగా నేడు సంఘీభావ ర్యాలీ

పార్వతీపురం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): భారత జవాన్లకు మద్దతుగా శుక్రవారం పార్వతీపురంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా చేపట్టిన సైనికుల కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్వతీపురం బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాపారులు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యువత పాల్గొనాలని కోరారు.

19 ఏళ్ల నిరీక్షణ ఫలించేనా?



పూర్ణపాడు - లాబేసు వంతెన



వేసవిలో ఇలా నది దాటుతూ మండల కేంద్రం కొమరాడకు వెళ్తున్న గ్రామస్థులు

- పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తికి ప్రజల ఎదురుచూపు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 80 శాతం జరిగిన పనులు
- 20 శాతం నిర్మాణంపై దృష్టి సారించని వైసీపీ సర్కారు
- ఇబ్బందుల్లో 36 గ్రామాల ప్రజలు
- పడవపై తప్పని రాకపోకలు
- వర్షాకాలంలో నానా అవస్థలు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

జియ్యమ్మవలస, మే 15 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కీలకమైన పూర్ణపాడు-లాబేసు వంతెన పనులకు మోక్షం కలగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తవడం లేదు. దీంతో ఎనిమిది పంచాయతీలు.. 36 గ్రామాల్లో వందలాది మంది ప్రజల కష్టాలు తీరడం లేదు. వారి నిరీక్షణ ఫలించడం లేదు. అత్యవసర సమయాల్లో ఆయా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అయితే నగావళి నది దాటి బయటకు వెళ్లలేని పరిస్థితి. బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. మండల కేంద్రం కొమరాడకు చేరుకోవాలంటే జియ్యమ్మవలస పరిధిలో ఉన్న గ్రామాల మీదుగా సుమారు 75 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. కొన్నేళ్లుగా ఆయా గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న గత టీడీపీ ప్రభుత్వం పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే 80 శాతం వరకూ పనులు పూర్తయిన తర్వాత.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. గత వైసీపీ సర్కారు 20 శాతం పనులను కూడా పూర్తిచేయించలేకపోయింది. దీంతో ఆయా గ్రామస్థులు ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

కొమరాడ మండలంలో 31 పంచాయతీలు వాటి పరిధిలో 154 గ్రామాలు ఉన్నాయి. అయితే నాగావళి నది ఈ మండలాన్ని రెండుగా చీల్చేసింది. ఐదు సచివాలయాల పరిధిలో 8 పంచాయతీలు నాగావళి నదికి తూర్పు వైపు ఉంటే, మిగిలిన 15 సచివాలయాల పరిధిలో 23 పంచాయతీలు ఈ నదికి పడమర వైపు ఉన్నాయి. ఈ వైపే మండలానికి చెందిన పరిపాలన కార్యక్రమాలన్నీ ఉన్నాయి. దీంతో తూర్పు వైపు ఉన్న దళాయిపేట, గుణదతీలేసు, కెమిశీల, కొట్టు, మాదలింగి, తొడుము, పాలెం, వన్నాం పంచాయతీలు, వాటి పరిధిలో ఉన్న 36 గ్రామాల ప్రజలు, ఉద్యోగులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. వర్షా కాలంలో మండల కేంద్రానికి రావాలంటే 50 నుంచి 75 కిలో మీటర్ల వరకు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తుంది. అత్యవసరమైతే ఇక అంతే సంగతులు. కొన్నిసార్లు మర పడవల పై ప్రాణాలకు తెగించి నదిలో ప్రయాణం చేయాల్సి వస్తుంది. పూర్ణపాడు - లాబేసు గ్రామాల మధ్య వంతెన నిర్మాణం పూర్తయితే దాదాపు 50 కిలో మీటర్ల ప్రయాణం తప్పుతుందని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు.



నదిలో పడవపై వెళ్తున్న గ్రామస్థులు (ఫైల్)

నిధుల కేటాయింపు ఇలా..

- పూర్ణపాడు - లాబేసు వంతెన పనులు 2006, సెప్టెంబరు 16న రూ. 3.20 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీని నిర్మాణ బాధ్యతను గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. ఆ తరువాత ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ శాఖకు 2009, జూన్ 3న బాధ్యతలు అప్పగించారు. 2010, మార్చి 22న పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి పనులు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- మార్కెట్లో రేట్లు పెరగడంతో 2011, ఏప్రిల్ 27న రూ.7 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. రాష్ట్రీయ శాం వికాశ్ యోజన (ఆర్ఎస్‌వీవై) (మిగతా 8వ పేజీలో..)

నిబద్ధతతో పనిచేయండి

- ప్రొబెషనరీ ఎస్ఐలకు ఎస్పీ సూచన



మాట్లాడుతున్న ఎస్పీ



హాజరైన ప్రొబెషనరీ ఎస్ఐలు

బెలగాం, మే 15 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధతతో పనిచేసి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి సూచించారు. శిక్షణ కోసం జిల్లాకు కేటాయించిన 38 మంది ప్రొబెషనరీ ఎస్ఐలు గురువారం మర్యాద పూర్వకంగా ఎస్పీని కలిశారు. ఈ సంద ర్భంగా వారితో ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంతో ముందుకు సాగాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలన్నారు. ప్రజలతో మమేకమవ్వాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని తెలిపారు. వారికి కేటాయించిన ఏజెన్సీ పోలీస్ స్టేషన్లో ఏ విధంగా విధులు నిర్వర్తించాలో తెలియజేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలను సందర్శించాలని, అక్కడ ప్రజలతో సమావేశమై వారికి సైబర్, నక్సలిజం, మత్తు పదార్థాలు, సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

వైస్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

- కలెక్టర్‌కు బొబ్బిలి కౌన్సిలర్ల విన్నపం

బొబ్బిలి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గిన నేపథ్యంలో వైస్ ఛైర్‌పర్సన్ వంతు వచ్చింది. వైస్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న గొలగాని రమాదేవిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు మళ్లీ అదే పంథాను అనుసరిస్తున్నారు. ఇందుకోసం కౌన్సిలర్ల నుంచి సంతకాలను సేకరిస్తున్నారు. ఛైర్మన్ పదవికి ఎన్నిక జరగాల్సి ఉంది. ఈలోగా వైస్ ఛైర్ పర్సన్‌పై కూడా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమెను కూడా పదవి నుంచి తప్పించాలని భావిస్తున్నారు. ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రతి పాదిస్తూ కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్ బాబు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు మరిపి తిరుపతిరావు, కొర్లాపు రామారావు తదితరులు ఉన్నారు.



విజయనగరం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

అమ్మవార్లకు నెలవు సాలూరు

- సాలూరు శ్యామలాంబ పండుగ నేపథ్యంలో ప్రత్యేక పూజలు



6లో

మొక్కలకు రక్షణగా దోమతెరలు

- అవగాహన లేక కొన్ని గిరిజన గ్రామాల్లో సక్రమంగా వినియోగించని వైనం
- ఉన్నతాధికారులు స్పందిచాలని విన్నపం

6లో

ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆసుపత్రుల్లో క్షేత్రస్థాయి సేవలు, నెలవారీ నివేదికలు , ఓపీ వివరాలు, ల్యాబ్ పరీక్షలు, మందులు, ఈహెచ్ఆర్ నమోదుపై చర్చించారు. ఆరోగ్య వివరాలు ఆయుష్మాన్ భారత్ ఐడీతో అనుసంధానమై ఉండాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రోగుల ఆసుపత్రికి వచ్చి తిరిగి వెళ్లే వరకు తగు దిశా నిర్దేశం చేస్తూ సంతృప్తికరమైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. గర్భిణుల వివరాలు నమోదు చేసి, నిర్దేశించిన సమయానికి వైద్య తనిఖీలు, టీకాలు, ఐరెన్ మాత్రలు అందించాలని తెలిపారు. డీఐవో నారాయణ రావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ఆదేశించారు. వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. 'పరిశీలించడం, శుభ్రం చేయడం, మూతలు పెట్టి ఉంచడం' వల్ల డెంగీకి దూరంగా ఉండొచ్చని పేర్కొన్నారు. జిల్లాలో గత ఏడాది 123 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు నాలుగు కేసులు నమోదైనట్టు తెలిపారు. పార్వతీపురం , పాలకొండ ఆసుపత్రుల్లో ఈ వ్యాధిని నిర్ధారించే పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి.. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని స్పష్టం చేశారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

బెలగాం, మే 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాల్లో లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏటా 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. జిల్లాలో ఏటా 2.20 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న పాల దిగుబడి ఈ ఏడాది మరింతగా పెరగాలి. గోశాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి. మత్స్య సంపదను పెంచాల్సి ఉంది. జీడి, పసుపు, పైనాపిల్, పామాయిల్ ఇతర అంతర పంటలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకం యూనిట్లను ప్రోత్సహించాలి.' అని తెలిపారు. పీఎం జన్‌మన్ కింద జిల్లాలో 5,853 గృహాలను గిరిజనులకు మంజూరు చేయగా.. ఇంకా 2,967 ఇళ్ల నిర్మాణం ఎందుకు ఇంకా ప్రారంభం కాలేదని కలెక్టర్ ప్రశ్నించారు. వారం రోజుల్లో నిర్మాణం ప్రారంభం కావాలని ఆదేశించారు. గృహ నిర్మాణానికి రూ.2.40 లక్షలు మంజూరు చేయడమే కాకుండా ముందు గానే రూ.70 వేలు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. ఇతర పథకాల కింద మంజూరైన గృహాల నిర్మాణం త్వరగా పూర్తిచేయడానికి ప్రభుత్వం జిల్లాలో 3,618 మందికి అదనపు నిధులు విడుదల చేసిందన్నారు. పార్వతీపురం, సాలూరు, మక్కువ, కొమరాడ తదితర ప్రాంతాల్లో ప్రగతిని చూపించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడో శనివారం విధిగా స్వర్ణ ఆంధ్రా-స్వచ్ఛ ఆంధ్రా కార్య క్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

16 టైలరింగ్ శిక్షణ కేంద్రాలు

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 16 టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఒక్కో కేంద్రంలో 144 మందికి 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం సర్టిఫికెట్, కుట్టు మిషన్ అందించనున్నట్లు చెప్పారు. మొదటి బ్యాచ్‌కు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో బ్యాచ్‌కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపీడీవోలు శిక్షణకేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. సీసీఆర్‌సీ కార్డులు డ్రైవ్ మోడ్‌లో జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుంచి కూడా రుణాలు పొందొచ్చన్నారు. రైతుల ఆధార్ కార్డుల మిస్ మ్యాచ్ ఉంటే సరిచేయాలని తెలిపారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు అవసరమైన పిల్లలకు వారి తల్లిదండ్రుల ద్వారా వెంటనే దరఖాస్తు చేయించాలన్నారు.

విద్యుత్ స్తంభాలే వంతెనలు

- కాలువలు దాటడం కష్టం
- ప్రమాదకరంగా ప్రయాణం



6లో

అమ్మో..పిడుగులు!

- ఏటా పదుల సంఖ్యలో మరణాలు
- అప్రమత్తతతోనే ప్రమాదాలకు దూరం

6లో



అమ్మో.. పిడుగులు!





- ఏటా పదుల సంఖ్యలో మరణాలు
- కుటుంబాలలో విషాదం
- అప్రమత్తతతోనే ప్రమాదాలకు దూరం

● ఈనెల 12న మెంటాడ మండలం కుంటిని వలస గ్రామానికి చెందిన కొల్లి రామారావు (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పులిగుమ్మి సమీపంలో మట్టి తవ్వుతున్న రామారావు సమీపంలో పిడుగు పడడంతో ప్రమాదం సంభవించింది. అతనితో పాటు ఉన్న కొల్లి సింహాచలం, లోకార్పు మురళి గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.

● ఈనెల 12న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం సుభద్ర సీతారాంపురం సమీపంలో పిడుగుపాటుకు 11 గొర్రెలు మృతి చెందాయి.

● ఏప్రిల్ 30న ఎస్.కోట మండలం గిరశిఖర పంచాయతీ పరిధిలోని దారపర్తి గ్రామానికి చెందిన పదేళ్ల చిన్నారి కిరణ్ పిడుగుపాటుకు మృతి చెందగా.. అతని సోదరుడు అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో పశువులు సైతం ప్రాణాలు కోల్పోయాయి. వర్షం కురుస్తున్న వేళ..చెట్టుకింద ఉన్న ఆవులను ఇంటికి తీసుకువచ్చేందుకు వెళ్లిన అన్నదమ్ముల్లో ఒకరు ప్రాణాలు కోల్పోగా... మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు.

రాజాం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏటా పిడుగుల వర్షంతో వివిధ ప్రాంతాల్లో మనుషుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పశుసంతతి మృత్యుబారిన పడుతోంది. చిన్నపాటి మేఘాలు దిగినా వాతావరణం భీకరంగా మారుతోంది. వెంటనే ఈదురు గాలులు.. ఉరుములు, మెరుపులతో వర్షం.. అప్పుడప్పుడు పిడుగులు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితికి వాతావరణంలోని మార్పులు ఒక కారణం కాగా.. మానవ తప్పిదాలు కూడా మరో కారణమని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎందుకిలా...

● భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తులో మేఘాల మధ్య ఘర్షణ నెలకొన్నా పిడుగుల తీవ్రత ఒకేలా ఉంటుందని, గాలి పీడనంలో వ్యత్యాసాలు మేఘాల కదలికల పైనే ఆధారపడి ఉంటాయన్నది వాతావరణ శాఖ నిపుణుల అభిప్రాయం.

● భూ ఉపరితలంలో 1.6 కిలోమీటర్ల నుంచి 13 కి.మీ. మధ్య మేఘాలు ఏర్పడతాయి.

● ఈ సమయంలో రెండు మేఘాల మధ ఘర్షణ నెలకొని అత్యధిక విద్యుదావేశం ఉద్భవిస్తుంది. ఆ సమయంలోనే ప్రకాశవంతమైన కాంతి, అధిక ధ్వని వెలువడతాయి. కాంతి వేగం ఎక్కువ కావడం వల్ల మొదట మెరుపు, ధ్వని వేగం తక్కువ కావడంతో అనంతరం శబ్దం వినిపిస్తాయి.

● మెరుపు ఎక్కువగా విస్తరిస్తే భూమిపై పిడుగు ప్రభావం తక్కువగా ఉంటుంది. మెరుపు ఒకేచోట మెరిసి, శబ్దం వస్తే దాని ప్రభావం భూ ఉపరితలంపై ఎక్కువగా ఉంటుంది.

● పిడుగు పడిన శబ్దం 24 కిలోమీటర్ల పరిధిలో అందరికీ వినిపిస్తుంది. ఆ సమయంలో 14 కిలోమీటర్ల పరిధిలో వర్షం కురిసే అవకాశం ఉంది.

● పిడుగుకి ఓ ఆకారం లేదు. ఎత్తయిన ప్రదేశాలలో, పెద్ద చెట్లపైన, తడిగా ఉన్న ప్రాంతాలలో పిడుగులు పడతాయి.

● ఎలక్ట్రానిక్, విద్యుత్ పరికరాలను పిడుగులు వేగంగా ఆకర్షిస్తాయి. అందుకే వర్షంలో సెల్‌ఫోన్ వాడకూడదు.

● వర్షంలో తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తే మంచిది. మనం ప్రయాణించే సమీపంలో ఎక్కడ పిడుగుపడినా సెల్‌ఫోన్లు ఆకర్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

● ముందస్తు సమాచారం కీలకం..



భారీ వర్షాలు, పిడుగులకు సంబంధించిన సమాచారాన్ని వాతావరణ శాఖ మెసేజ్‌ల ద్వారా తెలియజేస్తోంది. ఇలాంటి సమాచారాన్ని తేలికగా తీసుకోకుండా ప్రజలు ఖచ్చితంగా సూచనలు పాటిస్తే మంచిది. వర్షం కురిసే సమయంలో తడిసి వెళ్లినా పర్వాలేదు. కానీ పొడవైన తాటి, టేకు, కొబ్బరి, వేప తదితర చెట్ల కింద ఉండకూడదు. గొడుగు వేసుకుని వెళ్లడం ప్రమాదానికి సంకేతం. కార్లు తదితర వాహనాలలో ప్రయాణించేవారు ప్రయాణాన్ని ఆపివేస్తే మంచిది. వెళ్లాల్సి వస్తే కారు అద్దాలన్నిటినీ మూసివేయాలి. రైతులు, పశువుల కాపర్లు, గిరిజనులు, కూలీలు, బహిరంగ ప్రదేశాలలో పనిచేసే వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. ఇళ్లపై ఎత్తయిన ప్రదేశంలో మెటల్‌రాడ్‌ను బిగించాలి. పిడుగు పడితే ఇవి ఆకర్షించి ప్రమాదం జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

-పండూరు వేణుగోపాల్, సైన్స్ ఉపాధ్యాయుడు, కంచరాం ఉన్నత పాఠశాల



దత్తివలస సమీపంలో కాలువపై విద్యుత్ స్తంభాలు వేసిన దృశ్యం

విద్యుత్ స్తంభాలే వంతెనలు

- కాలువలు దాటడం కష్టం
- ప్రమాదకరంగా ప్రయాణం

గరుగుబిల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాల్వలకు సంబంధించి వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిటీషు కాలంలో నిర్మించిన కల్వర్టులు కావడంతో అనేకం శిథిలావస్థకు చేరుకున్నాయి. నిధుల సమస్య కారణంగా మరమ్మతులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. చిలకాం పంచాయతీ దత్తివలస, కారివలస గ్రామాల నడుమ వంతెన లేకపోవడంతో రాకపోకల కోసం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసుకున్నారు. అవే వంతెనలుగా ఉపయోగపడుతున్నాయి. శివ్వాం, కొత్తూరు, మరుపెంట, గొట్టివలస, లఖనాపురం, రావివలసతో పాటు మరికొన్ని గ్రామాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. విద్యుత్ స్తంభాల మీదుగా వంతెనను దాటే సమయంలో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారిన పడక తప్పదు. ఖరీఫ్ సమయంలో పండించిన పంటలను తెచ్చుకొనే సమయంలో వంతెన దాటడం కష్టమవుతోంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి రెండు కాల్వల పరిధిలో కల్వర్టులు, వంతెనలను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మొక్కలకు రక్షణగా దోమతెరలు

గుమ్మలక్ష్మీపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రజలు దోమ కాటుకు గురవకుండా...అనారోగ్యం పాలు కాకుండా ఉండడానికి ప్రభుత్వం దోమతెరలను సరఫరా చేసింది. అయితే వీటిని కొందరు సరిగా వినియోగించుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో గిరిజనులు వాటిని పక్కన పడేస్తుండగా... మరికొన్ని ప్రాంతాల్లో దోమతెరలను మొక్కలు, కూరగాయల పంటలకు రక్షణ కవచాలుగా వినియోగిస్తున్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి పంపిణీ చేస్తున్న దోమతెరలు ఇలా దుర్వినియోగం కావడంపై ఈ ప్రాంతీయులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వీటిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి... సరఫరా చేయాలని సూచిస్తున్నారు.



చదునుగూడలో మొక్కలకు రక్షణగా దోమతెర ఇలా..

40 చెరువుల అభివృద్ధికి ప్రణాళిక

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలో సీఎస్ఆర్ నిధులతో 40 చెరువుల అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. యాక్సిస్ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ధాన్ పౌండేషన్ ద్వారా ఈ పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు వచ్చినట్టు చెప్పారు. గురువారం తన చాంబర్‌లో ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలెక్టర్ తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలోని నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో 40 చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఐదేళ్ల పాటు అమలు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.15 కోట్లు వరకూ ఖర్చు చేసి చెరువుల్లో పూడిక తీయడం, గట్లు బలం చేయడం, మొక్కలు నాటడం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం వంటి పనులు చేపడతారని తెలిపారు. చెరువు ఆయకట్టుదారుల సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతాయన్నారు. ధాన్ పౌండేషన్ ప్రతినిధులు అనిల్, లోకేష్, రాంకుమార్, సీపీవో బాలాజీ, జెడ్పీ సీఈవో సత్యనారాయణ, డ్వామా పీడీ శారదాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

పల్లకిలో పెళ్లికూతురు..



కరకవలసలో ఓ వివాహ వేడుకలో భాగంగా పల్లకిలో పెళ్లికూతురిని ఊరేగించడం ఆకట్టుకుంది. గ్రామానికి చెందిన దుల్ల అప్పన్న, మంగలు తమ కుమారుడి వివాహ మహోత్సవంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమ తాత,తండ్రుల కాలం నుంచి వస్తున్న సంప్రదాయంలో భాగంగా ఇలా పల్లకిలో పెళ్లి కూతురిని ఊరేగించినట్టు తెలిపారు.

-వేపాడ, మే 15 (ఆంధ్రజ్యోతి)



ని-క్షయ్ మిత్రలుగా నమోదు చేసుకోండి

- 'మన్యం' కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, లయన్స్ క్లబ్ సభ్యులు, ఐఎంఏ సభ్యులు, ఎన్‌జీవోలు ని-క్షయ్ మిత్రలుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. వారందరూ క్షయ బారినన పడిన వ్యక్తులను దత్తత తీసుకొని వారికి అవసరమైన పౌషకాహారంతో పాటు మెరుగైన జీవనం కోసం స్వచ్ఛందంగా ప్రతి నెలా రూ.700 చొప్పున ఆరు నెలల పాటు ఇచ్చేందుకు యోచించాలన్నారు. వీటితో పాటు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులను రోగి క్రమం తప్పకుండా తీసుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే పది మంది ప్రభుత్వ వైద్యులు టీబీ బాధితులను దత్తత తీసుకున్నారని తెలిపారు. మిగిలిన ఉద్యోగులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు. సంబంధిత అధికారులతో కలెక్టర్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెలాఖరు నుంచి టీబీపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు రక్తపోటు, చక్కెర వ్యాధి, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, 60 ఏళ్లు పైబడిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1400 మంది వరకు క్షయ పీడితులు ఉన్నారని తెలిపారు. టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. టీబీ బాధితుల పోషకాహారం కోసం విరాళాలు అందించేవారు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి ఖాతా నెంబర్: 004012010003135, ఐఎఫ్ఎస్‌సి కోడ్: యుబిఐఎన్0800406, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెలగాం, మెయిన్‌రోడ్డు, పార్వతీపురం అనే ఖాతాలో జమ చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇతర వివరాలకు 80083 11511 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు నెలవు సాలూరు

- శ్యామలాంబ పండుగ నేపథ్యంలో ప్రత్యేక పూజలు

సాలూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి)

సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండగను 14 ఏళ్ల అనంతరం ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్నారు. గ్రామదేవత శ్యామలాంబ అయినా సాలూరు సంరక్షణలో ఆమెకు మరో ఆరుగురు సోదరిమణులు తోడ్పాటునందిస్తారని భక్తుల విశ్వాసం. పండుగ సమయంలో భక్తులు అమ్మవార్లకు ఉపాహారాలు, పసుపు కుంకుమలివ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ అమ్మవార్ల విశిష్టతను పరిశీలిస్తే...

● **కొత్తమ్మ:** సాలూరులో శ్యామలాంబ సోదరిగా కొత్తమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. శ్యామలాంబ పండుగ నిర్వహించడానికి నిర్ణయిస్తే ఏడాది ముందుగా కొత్తమ్మ పండుగను చేస్తారు. సిరిమానోత్సవానిన మినహాయించి శ్యామలాంబ పండుగలాగానే సాలూరు వాసులు ఈ వేడుకలు నిర్వహిస్తారు. కొత్తమ్మ పండుగను నిర్వహించకుండా శ్యామలాంబ పండగను నిర్వహించరు. వాస్తవానికి శ్యామలాంబ ఉత్సవాలు 2019లో జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 2018లోనే కొత్తమ్మ పండుగను పూర్తి చేశారు. శ్యామలాంబ పండుగ ఐదేళ్ల జాప్యం జరిగింది. ప్రస్తుతం వేడుకలు నిర్వహిస్తుండడంతో కొత్తమ్మకు ఈ ఏడాది జనవరిలో మళ్లీ మొక్కుబడులు చెల్లించారు. కొత్తమ్మకు ఇటీవల సుందరమైన ఆలయం నిర్మించారు. ఆలయం వద్ద నిర్మించిన సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం ప్రత్యేకత సంతరించుకుంది.



కొత్తమ్మ తల్లి

● **పైడితల్లమ్మ:** శ్యామలాంబ సోదరీమణుల్లో పైడితల్లమ్మ ఒకరు. ఆమెకు సాలూరు జాతీయ రహదారిలోని డిగ్రీ కళాశాల వద్ద ఆలయం ఉంది. ఆమెకు పండుగ సందర్భంగా పూజలు చేస్తున్నారు.

● **దేశమ్మ:** శ్యామలాంబ మరో సోదరి దేశమ్మ. సాలూరులో దేశమ్మకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తారు. తొలుత దేశమ్మకే మొక్కుబడులు చెల్లిస్తారు. ఆమెకు పైడితల్లి అమ్మవారి ఆలయం పక్కనే వృక్షరాజం, విగ్రహ రూపంలో భక్తులు పూజలు చేస్తున్నారు.

● **నూకాలమ్మ:** శ్యామలాంబ సోదరి నూకాలమ్మ. ఆమెకు సాలూరు వేగావతి సమీపంలో ఆలయం ఉంది. నూకాలమ్మకు సాలూరు ప్రాంతంలో ప్రత్యేకత ఉంది. ఆమె పాచిపెంట గ్రామదేవత. సాలూరులో శ్యామలాంబ పండుగ నిర్వహించడానికి వారం రోజుల ముందు ఆమెకు పాచిపెంటలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్యామలాంబ పండుగ ఈ నెల 20న జరగనుండడంతో ఈ నెల 13న పాచిపెంటలో ఆమెకు పండుగను నిర్వహించారు. సాలూరులో ఆమెకు సైతం పూజలు చేశారు.

● **ముత్యాలమ్మ:** శ్యామలాంబ మరో సోదరి ముత్యాలమ్మ. ఆమె ఆలయం సాలూరు పోలిమేర వేగావతి నదీ తీరంలో ఉంది. గ్రామానికి తొలి సంరక్షురాలుగా ఆమెను విశ్వసిస్తారు. శ్యామలాంబకు పండుగైనా... వారోత్సవాలైనా ఆమెకు తప్పకుండా మొక్కుబడులు చెల్లిస్తారు. ఇటీవల ఆమెకు సుందరమైన ఆలయాన్ని నిర్మించి... విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.


● **దుర్గమ్మ:** శ్యామలాంబకు మరో సోదరి దుర్గమ్మ. ఆమెకు కోటవీధిలో ఆలయం ఉంది. శ్యామలాంబ పండుగ సందర్భంగా దుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు, మొక్కుబడులు చెల్లిస్తున్నారు. ఈ ఏడుగురు అమ్మవార్లతో పాటు మరికొందరు అమ్మవార్లకు ఉపాహారాలు, మొక్కుబడులు చెల్లిస్తారు. సత్తెమ్మ, పరదేశమ్మ, బంగారమ్మ తదితర అమ్మవార్లు భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు.



సత్తెమ్మ తల్లి



పైడితల్లి, దేశమ్మ ఆలయాలు



నూకాలమ్మ ఆలయం



ముత్యాలమ్మ ఆలయం

లాభాల బాటలో డీసీసీబీ

● రూ.7.66 కోట్ల నికర ఆదాయం

● ఎ- క్లాస్ వాటాదారులకు రూ.1.09 కోట్ల డివిడెండ్

● బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ సేతు మాధవన్

విజయనగరం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) లాభాల బాట పట్టిందని డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ సేతు మాధవన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన బ్యాంకు మహాజన సభ జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి లావాదేవీల ముగింపునకు సంబంధించి సాట్యూటరీ ఆడిట్, లాభనష్టాల నివేదికను చర్చించి సమావేశంలో ఆమోదించినట్టు బ్యాంకు సీఈవో సీహెచ్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ..7.88 కోట్ల నికర లాభం ఆర్జించిందన్నారు. లాభాల బాట వైపు నడిపిన సహకార సిబ్బంది, డీసీసీబీ సిబ్బందిని ఆయన అభినందించారు. గత ఆర్థిక సంవత్సరం నెట్ ఎన్‌పీఏ రూ.3.12 కోట్లు నమోదైందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లాభాలు ఆర్జించిన దృష్ట్యా బ్యాంకునకు చెందిన ఎ-క్లాస్ వాటాదారులకు లాభాల్లో ఒక శాతం రూ.1.09 కోట్లు డివిడెండ్‌గా ప్రకటించామన్నారు. మహాజన సభలో జిల్లా సహకార అధికారి రమేశ్, నాబార్డు డీడీవో నాగార్జున, ఆప్కాబ్ డీజీఎం అప్సర్ జహన్‌తో పాటు సహకార శాఖాధికారులు, సహకార సంఘాల పీఐసీలు పాల్గొన్నారు.

గత రెండేళ్ల కంటే అధికంగా..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు గత రెండేళ్ల కంటే నికర ఆదాయం పెరుగుతోంది. బ్యాంకు, బ్రాంచ్‌ల నిర్వహణ వ్యయం తగ్గించుకోవడంతో పాటు, రుణాలు సకాలంలో వసూలు చేయడం, డిపాజిట్లు సేకరించడం, మొండి బకాయిలు తగ్గించుకుంటూ వెళ్లడంతో నికర ఆదాయం క్రమేణా పెరుగుతోంది. 2023లో నికర ఆదాయం రూ.7.29 కోట్ల కాగా, 2024 నికర ఆదాయం రూ.7.46 కోట్లు, ఈ ఏడాదికి సంబంధించి రూ.7.66 కోట్లు నికర ఆదాయాన్ని ఆర్జించింది. రానున్న కాలంలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా ముందుకు తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం వున్న ఏటీఎంల స్థానంలో నూతన ఏటీఎంలు తీసుకురావాలని బ్యాంకు అధికారులు నిర్ణయించారు. పీఏసీఎస్‌ల్లో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ పూర్తవ్వడంతో రానున్న కాలంలో అన్ని పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణతో పాటు పీఏసీఎస్‌ల ఆదాయాన్ని కూడా పెంచాలని నిర్ణయించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా డీసీసీబీ, దాని అనుబంధ శాఖల్లో ఆయా మార్పులను చేపట్టాలని మహాజన సభ నిర్ణయించింది.



మహాజన సభలో జేసీ సేతు మాధవన్

జూన్ తొలివారంలో ఏఎంసీ ప్రమాణ స్వీకారం?

విజయనగరం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం జూన్ తొలి వారంలో కొలువు దీరనున్నట్టు తెలిసింది. ఏఎంసీ ఛైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు కర్రోతు నర్సింగరావును పార్టీ నియమించింది. వీరితో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నిబంధనల ప్రకారం 18 మందిని నియమించనున్నారు. అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఇప్పటికే కర్రోతు నర్సింగరావు ఏఎంసీకి అందజేశారు. ఏఎంసీ అధికారులు ఆ వివరాలను మార్కెటింగ్ శాఖాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. మార్కెట్ కమిటీకి సంబంధించి ప్రభుత్వం ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లతో కూడిన జాబితాను ఆమోదిస్తూ ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. మరోవైపు టీడీపీలో వరుస కార్యక్రమాలు ఈ నెలఖరు వరకూ ఉన్నాయి. నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు, జిల్లా స్థాయి మహానాడు తరువాత ఈ నెల 26, 27, 28 తేదీల్లో కడపలో జాతీయ స్థాయిలో మహానాడు కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాలకవర్గ నియామకాలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు టూర్ షెడ్యూల్‌ను అనుసరించి ఈ నెలఖరు లేదా జూన్ తొలివారంలో ఏఎంసీ పాలకవర్గం కొలువుదీరే అవకాశం ఉంది.

నేడు మంత్రి ప్రజాదర్బార్

బొండపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని రాజులచావడి వద్ద కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు

రాజాం, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగంలోని పోస్టాఫీసులో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శివ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డులో పేరు, చిరునామా, మొబైల్ నెంబరు, పుట్టిన తేదీ, ఫొటో వంటి వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

డెంకాడ పీహెచ్‌సీ వైద్యాధికారిగా అనూష

డెంకాడ, మే 15(ఆంధ్రజ్యోతి): డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా అనూష నియమితులయ్యారు. ఇక్కడి వైద్యాధికారి భవాని విజయనగరం మెడికల్ కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో భోగాపురం మండలం పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూషను డెంకాడ బదిలీ చేశారు.

సమ్మెను జయప్రదం చేయండి

లక్కవరపుకోట (కొత్తవలస), మే 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెను 20న విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ పిలుపునిచ్చారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయు ఆధ్వర్యంలో లక్కవరపుకోటలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఉపాధి వేతనదారుల మద్దతు కోరారు.

విద్యార్థులకు డ్రాయింగ్ శిక్షణ

శృంగవరపుకోట, మే 15 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శాఖా గ్రంథాలయం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు డ్రాయింగ్‌లో తర్ఫీదు ఇచ్చారు. క్యారం బోర్డు, చదరంగం ఆటలను నేర్పించారు. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి డి.శ్రీధర్, ఉపాధ్యాయుడు త్రినాథరావు ఉన్నారు.

జీవవైవిధ్యాన్ని ప్రోత్సాహిద్దాం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్యాన్ని ప్రోత్సాహించేందుకు వేడిని ఓడించండి అనే కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ వేడిని తగ్గించేందుకు పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ఇంటి పైకప్పు తోట, తోటల పెంపకం, ప్రభుత్వ కార్యాలయాలు, గృహాల పైకప్పులపై సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వేయించాలన్నారు. తాగునీటి బూతులు, మట్టికుండ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. నీడనిచ్చే చెట్లను ఎక్కువగా నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ రవికుమార్ తదితరులున్నారు.

రావాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట (కొత్తవలస), మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపాత్రుని పాలెంలో రావాలమ్మ తల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే లలితకుమారి దంపతుల దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రానున్న ఖరీఫ్‌లో వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, సుధారాణి, కేబీఏ రాంప్రసాద్, మల్లా రామకృష్ణ, లెంక శ్రీనుపాల్గొన్నారు.

చురుగ్గా మట్టి రోడ్డు పనులు



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

వేపాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారయ్యపేట-చిట్టివానిపాలెం మధ్య మట్టి రోడ్డు నిర్మాణంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సమస్యను మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు.. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించారు. మట్టి రోడ్డు నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు చేశారు. దాంతో చురుగ్గా రోడ్డు పనులు జరుగుతున్నాయి.

నేడు నగరంలో తిరంగా ర్యాలీ

విజయనగరం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో టీడీపీ, బీజేపీ జనసేన పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు మీదుగా గంటస్తంభం జంక్షన్ వరకూ తిరంగా ర్యాలీ జరుగుతుందని టీడీపీ నగర, మండల పార్టీల అధ్యక్షులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో పాటు బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈనెల 19న ఎన్నికలు

విజయనగరం కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ఖాళీగా ఉన్న మూడు వ్యవస్థలకు ఈనెల 19న ఎన్నికలు నిర్వహించనున్నామని జేసీ సేతు మాధవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్, కొత్తవలస మండల పరిషత్‌లో కో-ఆప్షన్ సభ్యుడు, గరివిడి మండలం సేరిపేట పంచాయతీలో ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో బంగారమ్మ పండుగ



ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

శృంగవరపుకోట రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబడాసుపాలెంలో బుధవారం గ్రామదేవత బంగారమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ అభివృద్ధి పనుల జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని మోదవలస, గొండయ్యపాలెం, జరజాపు కల్లాలు, బంగార్రాజుపేట, కొండరాజేరుపేట, చిన వల్లూరు, పెదపోలిపల్లి, మహారాజుపేట, రాజపులోవ, చెరుకుపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పందుల పెంపకానికి ప్రత్యేక స్థలాలు: జేసీ

విజయనగరం కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పందుల కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలని జేసీ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీల్లో పందుల సమస్య పరిష్కారంలో భాగంగా హైకోర్టు ఉత్వర్వులకు అనుగుణంగా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 1085, బొబ్బిలి 45, రాజాంలో 40, నెల్లిమర్ల మున్సిపాల్టీలో 16 పందులు ఉన్నట్టు అధికారులు నివేదికలు అందజేశారన్నారు. ప్రభుత్వ ఉత్వర్తులు మేరకు మున్సిపాలిటీ పరిధి నుంచి 5 కిలోమీటర్ల లోపల పందులు పెంపకానికి స్థలం కేటాయించాల్సి ఉందన్నారు. వీటి ప్రకారం విజయనగరంలో సుమారు 2 ఎకరాలు, బొబ్బిలిలో 0.3, రాజాంలో ఎకరా, నెల్లిమర్లలో 0.15 స్థలం కేటాయించాల్సి ఉందన్నారు. మార్కెట్ ధర లేదా లీజు ప్రాతిపదికన ఈ స్థలాలను పందులు పెంపకందారులకు కేటాయించనున్నట్టు తెలిపారు. పందులు పెంపకం వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలోని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తదితరులు ఉన్నారు.

ఈ-స్టాంప్‌ల విక్రయాలపై విచారణ



విచారణ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్

చీపురుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ- స్టాంప్‌లను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న పిర్యాదుపై జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర గురువారం విచారణ నిర్వహించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదుదారుడితో పాటు వెండర్ల నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి పట్టణానికి చెందిన నోటరీ న్యాయవాది పప్పల తవిటినాయుడు దీనిపై ఫిర్యాదు చేశారన్నారు. ప్రజలు, వెండర్ల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని ఉపేంద్ర తెలిపారు. స్టాంప్‌ల విక్రయం నిబంధనల ప్రకారం జరగాలన్నారు. ఆయన వెంట చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ టీపీఎస్‌కే లక్ష్మణరావు ఉన్నారు.

కొనసాగుతున్న సదరం క్యాంప్



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ నేతాజీ

రాజాం, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపు కొనసాగుతోంది. దరఖాస్తుదారులకు వైద్యులు తనిఖీలు చేసి ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారు. గతంలో జారీ చేసిన సదరం ధ్రువపత్రాలు సక్రమంగా లేవని ప్రభుత్వం గుర్తించి వారి సర్టిఫికెట్లను పరిశీలించడానికి జిల్లా కేంద్రం నుంచి వైద్యులను నియమించారు. కళ్లకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. ఎముకలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించడానికి మరో 15 రోజులు పాటు గడువు ఇచ్చారు. ఇంతవరకు 3 వేల ధ్రువపత్రాలను వైద్యులు పరిశీలించారు. సదరం క్యాంప్‌నకు వస్తున్న దివ్యాంగులకు కో-ఆర్డినేటర్ ఎ.చిరంజీవి సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా చూడటానికి వెలుగు సిబ్బందిని నియమించారు.

వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

గజపతినగరం, మే15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ఎం.రమేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు జరిగేచోట తాటికమ్మలతో షెడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సుగుణాకరరావు, మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏజీపీగా మండల సూర్యనారాయణ



సూర్యనారాయణ

చీపురుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది మండల సూర్యనారాయణ సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న జారీ చేసింది. చీపురుపల్లి బార్ అసోసియేషన్‌లో సభ్యుడైన సూర్యనారాయణ కొంత కాలంగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఏజీపీగా నియమితులైన ఆయన ఆ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణను న్యాయవాదులు అభినందించారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

● సప్లిమెంటరీకి ప్రత్యేక తరగతులు

● ఈనెల 19 నుంచి పరీక్షలు ప్రారంభం

గజపతినగరం, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో పదోతరగతి కీలకం. చదువుకు గుర్తింపు రావాలన్నా, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నా పదోతరగతి తప్పనిసరి. దాంతో ఇటీవల నిర్వహించిన టెన్త్ పరీక్షలకు వివిధ కారణాలతో హాజరు కాలేనివారు, ఉత్తీర్ణత సాధించని విద్యార్థులపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. మే నెలలో నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నా రు. ఎక్కువగా గణితం, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

● మండు వేసవిలోనూ

మండు వేసవిలో సైతం ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా విద్యాబోధన చేస్తున్నారు. ఉదయం 7.45 నుంచి 11.45 గంటళ వరకు వారికి శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 18 వరకు ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన, పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నారు. మే 19 నుంచి నిర్వహించనున్న పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 2,851 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

విద్యా సంవత్సరం నష్ట పోకూడదని..

టెన్త్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు అకడమిక్ సంవత్సరం నష్ట పోకూడదనే ఉద్దేశంతో సప్లిమెంటరీ పరీక్షల కోసం పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నాం. పాస్ గ్యారంటీ దిశగా వారికి తర్ఫీదు ఇస్తున్నాం. అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా తరగతుల నిర్వహణ జరుగుతోంది.

- కె.మెహనరావు, డిప్యూటీ డీఈవో



మరుపల్లిలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

డీజే పాటలకు స్టెప్పులేసి.. ఆపై కుప్పకూలి

● వివాహ ఊరేగింపులో విషాదం

● గుండెపోటుతో వ్యక్తి మృతి



బంగారునాయుడు (ఫైల్)

పాలకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): డీజే పాటలకు హుషారుగా స్టెప్పులేస్తూ.. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. వివాహ కార్యక్రమం ఊరేగింపులో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఈ విషాదకర ఘటన పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. భాసూరు గ్రామంలో బుధవారం ఓ ఇంటి వద్ద వివాహ వేడుకలు నిర్వహించారు. అదే రోజు అర్ధరాత్రి ఊరేగింపు చేపట్టారు. ఇదే సమయంలో డీజే సౌండ్ బాక్సుల వద్ద పలు పాటలకు అక్కడి వారు హుషారుగా స్టెప్పులేశారు. బంధువైన సుంకరి బంగారునాయుడు (40) వారితో కలిసి నృత్యం చేశాడు. ఇంతలో ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయాడు. ఏమి చేయాలో తెలియని సహచరులు వెంటనే తేరుకుని బంగారునాయుడుకు సపర్యలు చేశారు. అయినా చలనం లేకపోవడంతో కంగారు పడ్డారు. హుటాహుటిన పాలకొండ ఆసుపత్రికి తరలించారు అప్పటికే బంగారునాయుడు మృతి చెందాడు. గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతుడి బంధువులు గుండెలవిసేలా రోదించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బంగారునాయుడు పెయింటర్‌గా పనులు చేస్తూ.. భార్య, ఇద్దరు కుమార్తెలు, తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. అయితే కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో వారంతా కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దత్తిరాజేరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినచామలాపల్లి గ్రామానికి చెందిన చిడగ బాలకృష్ణ (44) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపిన వివరాల మేరకు.. చిడగ బాలకృష్ణ తరచూ మద్యం సేవిస్తుంటాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు మందలించినప్పటికీ మద్యాన్ని మానకుండా తరచూ భార్యతో గొడవపడేవాడు. మందలిస్తే ఆత్మహత్య చేసుకుంటానని ఎప్పటికప్పుడు బెదిరించేవాడు. బుధవారం కూడా ఎప్పటిలాగే మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దాంతో మనస్తాపానికి గురయ్యాడు. గొర్రెలు మేపేందుకు వెళ్లి అక్కడే గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరిన బాలకృష్ణను 108లో బుధవారం రాత్రి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి చిడగ అచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి భార్య రాధ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వీరఘట్టం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.రాజపురంలో విద్యుదాఘాతంతో కొప్పర రాము(64) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి 1.30 గంటల సమయంలో కాలకృత్యాలు నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో ఇంటిపక్కనే ఖాళీ స్థలంలో గాలికి తెగిపడిన విద్యుత్ తీగ కాలికి తగలడంతో ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన కుమారుడు కొప్పర సంజీవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు.

భూ తగాదా: నలుగురిపై కేసు నమోదు

లక్కవరపుకోట, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చింపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి ఎర్రయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలెక్టర్ గ్రీవెన్స్‌లో భూ తగాదాలపై కల్లెంపూడి రాములమ్మ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దానిపై స్థానిక రెవెన్యూ శాఖాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా సర్పంచ్ భూమిరెడ్డి ఎర్రయ్యమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భూమిరెడ్డి సతీష్‌ల భూ వివరాలను అడిగారు. సంబంధిత భూమి కల్లెంపూడి రాములమ్మ కుటుంబానిది కాదని వారు చెప్పారు. దాంతో రాములమ్మ, ఆమె కుటుంబ సభ్యులు రామునాయుడు, జగదీష్, తోట నాయుడు కలిసి ఎర్రయమ్మ, సతీష్‌లపై దాడికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఎర్రయ్యమ్మకు గాయాలు కావడంతో ఎస్.కోట ఆసుపత్రికి తరలించామన్నారు. బాధతురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

సంతకవిటి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షాలీపేట గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైందని ఆమె తండ్రి పెదగాడ అప్పలాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఇంటర్మీడియట్ పరీక్ష రాయడానికి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారి ఇళ్లల్లో వెతికామని, ఆ చూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

పరీక్ష రాస్తూ స్పృహ కోల్పోయిన విద్యార్థిని

గంట్యాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తూ కొటారుబిల్లికి చెందిన విద్యార్థిని ఆరిపాక యశస్విని స్పృహ కోల్పోయింది. యశస్విని కొటారుబిల్లిలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదివింది. పరీక్షలో మార్కులు తక్కువ రావడంతో బెటర్‌మెంట్ కోసం కట్టారు. గురువారం జువాలజీ పరీక్ష రాస్తూ స్పృహ కోల్పోయింది. వెంటనే సిబ్బంది గంట్యాడ పీహెచ్‌సీ తరలించారు. బీపీ డౌన్ కావడంతో స్పృహ కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి రూ.5 లక్షలు

● ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

చీపురుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): శిక్షణ సమయంలో జరిగిన ప్రమాదం కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఓ ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం మంజూరు చేసింది. మండలంలోని పర్ల గ్రామానికి చెందిన చందక గోవింద్ 2023 ఏప్రిల్ 4న పారాచూట్ శిక్షణలో జరిగిన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన కుటుంబ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో సర్పంచ్ మహంతి అప్పలనాయుడు ఆర్థికసాయం కోసం కుటుంబం తరపున పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ బోర్డు ద్వారా వినతిపత్రాలను అందజేశారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు పరిస్థితిని వివరించి గోవింద్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అందుకు సానుకూలంగా ఎమ్మెల్యే కళా స్పందించి చర్యలు చేపట్టారు. దాంతో గోవింద్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫు న రూ.5 లక్షలు మంజూరు చేస్తూ రాజకీయ విభాగం ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మొత్తాన్ని త్వరలోనే కుటుంబానికి అందజేయ నున్నట్టు సర్పంచ్ తెలిపారు.

మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

భోగాపురం, మే15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ మద్యం దుకాణాలను విజయనగరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఒక్కరికే ఎక్కువ మద్యం ఇవ్వరాదన్నారు. నిబంధనలు పాటించడం తప్పనిసరి అన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఆరుబయట మద్యం తాగకుండా చూడాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. ఆయనతో పాటు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్, ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సీ పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదు'

రాజాం, మే 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసేవారు మ్యారేజ్ సర్టిఫికెట్ జత చేయాల్సిన అవసరం లేదని సీఎస్‌డీటీ ఎ.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ వెసులుబాటు కల్పించారన్నారు. రాష్ట్రంలో వాట్సాప్ గవ ర్నెన్స్ మనమిత్రలో రేషన్ కార్డుల సేవలు అందుతున్నాయన్నారు. వా ట్సాప్‌లో బియ్యం కార్డులు జారీ, కార్డుల విభజన, అడ్రస్ మార్పు, కు టుంబ సభ్యుల పేర్లు చేర్పు, తొలగింపులు. కార్డుల సరెండర్ వంటి సేవలు అందుతున్నాయని సీఎస్‌డీటీ వివరించారు.

19 ఏళ్ల నిరీక్షణ ఫలించేనా?

(ఐదో పేజీ తరువాయి)

నుంచి రూ. 3.50 కోట్లు, నాబార్డు నుంచి రూ. 3.50 కోట్లు కలిపి కొత్త రేట్లు ప్రకారం నిధులు మంజూరు చేశారు. విశాఖకు చెందిన ఎం/ఎస్ వెంకట పాండురంగ కనస్ట్రక్షన్‌కు పనుల బాధ్యత అప్పగించారు. కానీ సకాలంలో పనులు ప్రారంభించకపోవడంతో ఆ కాంట్రాక్టును రద్దు చేశారు.

● 2015, జనవరి 23న రూ. 9.98 కోట్లతో మళ్లీ కొత్త ఎస్టిమేట్లు వేయించారు. అదే ఏడాది మే 25న హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు పనులు అప్పగించారు. 2017, మే 24 నాటికి పూర్తి చేయాలని తొలుత నిర్ణయించారు. ఆ తర్వాత 2020, జూన్ 20 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ధరల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని రివైజ్డ్ ఎడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ (ఆర్‌ఏఎస్) రూపంలో రూ. 14 కోట్లకు నిధులు పెంచారు. 2018 వరకు 80 శాతం పనులు పూర్తి చేశారు.

● 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పరిస్థితి మారింది. పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో గత ఐదేళ్లుగా పనులు సాగడం లేదు. దీని నిర్మాణంపై వైసీపీ పాలకులు ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి.

ఇంతవరకు జరిగిన పనులు

● నాగావళి నదిపై 11 పిల్లర్లతో పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఓపెన్ ఫౌండేషన్ ఏడో పిల్లర్ నుంచి 11వ పిల్లర్ వరకు శ్లాబ్ లెవెల్ పూర్తి చేశారు. ఒకటో స్తంభం వద్ద స్లాబ్ కంటే కొంచెం తక్కువ స్థాయిలో నిర్మాణం పూర్తి చేశారు. 2వ స్తంభం మాత్రం నదిలో ఉండడం వల్ల తరువాత పనులు చేపడతామని వదిలేశారు. రెండు అబుట్‌మెంట్లు, 12 స్లాబ్‌లలో ఏడు స్లాబ్‌లు పూర్తి చేశారు. అంటే లాబేసు వంతెన వైపు పనులు పూర్తవగా, పూర్ణపాడు వైపు 30 మీటర్ల వరకు ఎప్రోచ్‌వాల్స్ పూర్తి చేశారు. మిగిలిన పనులు ఇంకా చేయాల్సి ఉంది.

● దీనిపై సంబంధిత కాంట్రాక్టర్‌కు పలుమార్లు నోటీసులు పంపినా ఎటువంటి స్పందన లేదు. కొద్ది రోజుల తరువాత పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త ఎస్టిమేట్లతో నిధులు మంజూరు చేస్తే తప్ప ఏమీ చేయలేమని మెయిల్ ద్వారా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగ ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కొత్త ఎస్టిమేట్లతో రూ. 15.80 కోట్లు కావాలని కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించారు.

● ఈనెల 13న ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌తో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సమావేశం నిర్వహించగా.. రూ. 14 కోట్లతోనే పనులు చేయాలని నిర్ణయించారు. గత కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు చెల్లించి, కొత్త కాంట్రాక్టర్‌తో పనులు కొనసాగించాలని ఆదేశించారు. అయితే ఇంత వరకు రూ.8కోట్లతో పనులు జరిగాయని అధికారులు తెలిపారు. ఇంకా రూ.7కోట్లు పనులు చేయాల్సి ఉందని పూర్తి నివేదికను అందించారు.

కచ్చితంగా పూర్తవుతుంది..

పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం అనేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో కచ్చితంగా పూర్తవుతుంది. ఈ విషయాన్ని అసెంబ్లీలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లాను.

- తోయక జగదీశ్వరి, ప్రభుత్వ విప్, కురుపాం

ప్రభుత్వం దృష్టిలో ఉంచాం..

పూర్ణపాడు-లాబేసు వంతెన పనులకు సంబంధించి పూర్తి నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించాం. ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం.

- చంద్రశేఖర్, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ, పార్వతీపురం మన్యం

నిధులు ఖర్చు చేయని పాలకవర్గాన్ని ఏమనాలి?

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసేందుకు రూ.2 కోట్లు నిధులు తెస్తే ఖర్చు చేయని పాలకవర్గాన్ని ఏమనాలని, పట్టణ ప్రజలు నడిరోడ్డుపై నిలబెట్టి ప్రశ్నించే రోజు తప్పకుండా వస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం సాలూరులోని తన నివాసంలో ఆమె స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిపాలనలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల 5 సంవత్సరాలుగా రోడ్లు గుంటలుగానే మిగిలిపోయాయన్నారు. గత ప్రభుత్వం కాలంలో మున్సిపాలిటీ సమర్థవంతంగా పనిచేయకపోవడంతో శ్యామలాంబ పండగ కూడా నిర్వహించలేదన్నారు. శానిటైజేషన్ కోసం సరైన సామగ్రిని కూడా మున్సిపాలిటీకి అందించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకవర్గం ఆమోదం తెలపకపోతే కలెక్టర్ నుంచి ప్రత్యేక నిధులు తెప్పించి యుద్ధ ప్రాతిపదికన రోడ్లు మరమ్మతులు చేస్తామని తెలిపారు. ప్రజలకు రెండు పూటలా తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. రెండు వార్డులకు ఒక మున్సిపల్ ట్యాంకు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పట్టణంలో సీసీ కెమెరాలను తన సొంత డబ్బులతో తెప్పించి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ ఆదివారం అమ్మవారి ఉయ్యాల కంబాల కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని ఆడించుకుందామని పిలుపునిచ్చారు. అలాగే సోమవారం అమ్మవారిని గద్దె దగ్గర ఉంచి అక్కానవీధి, అల్లువీధి, యాదవుల వీధి, డబ్బీవీధి, మెంటాడ వీధుల నుంచి తోలేళ్ల ఉత్సవం నిర్వహిస్తారని తెలిపారు. మంగళవారం సిరిమానోత్సవం అద్భుతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ● పండగను నేపథ్యంలో ప్రజలు చెత్త కవర్లను మున్సిపాలిటీ వాహనంలోనే వేయాలని, రోడ్లు, మున్సిపాలిటీ కాలువలను శుభ్రంగా ఉంచాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. పండగ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు(చిట్టి), హర్షవర్ధన్, బృందావన అశోక్, పప్పల మోహనరావు, కూనిశెట్టి భీమారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రతి గ్రామానికీ రహదారి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



తారు రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ పక్కా రహదారి సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. లక్కగూడ నుంచి చదునుగూడ గ్రామం వరకు రూ.75లక్షలతో నిర్మించిన తారురోడ్డును ఆమె గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముందు గ్రామంలో ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కద్రక కళావతి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

● కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాల ప్రారంభం

పాలకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. పట్టణంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణా శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు, ఎంపీపీ బొమ్మాళి భాను, కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్, కొరికాన గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు. ● వీరఘట్టం: వీరఘట్టంలోని కనోసా ఆసుపత్రి ప్రాంగణంలో బీసీ కార్పొరేషన్ ద్వారా 90 రోజుల ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే జయకృష్ణ ప్రారంభించారు. ఎంపీడీవో వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, కూటమి నాయకుడు పి.కృష్ణమూర్తినాయుడు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి పాల్గొన్నారు. ● భామిని: మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థిక అభివృద్ధి చెంది సమాజంలో గౌరవం దక్కేలా చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. భామినిలో బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టుమిషన్ శిక్షణను ఆయన గురు వారం ప్రారంభించారు. ఘనసరలో వ్యవసాయ అధికారి సింహాచలం ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. 50 శాతం రాయితీపై వీటిని అందించారు. టీడీపీ నాయకులు బి.రామినాయుడు, ఎం.జగదీశ్వరరావు, భూపతి ఆనందరావు, ఏ.కేశవ, రాజేష్, పి.నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులు తీరు మార్చుకోవాలి

భామిని: అధికారులు తమ తీరు మార్చుకకోపతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే జయకృష్ణ ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన భామినిలో టైలరింగ్ శిక్షణా కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తమకు అధికారులు ఎటువంటి సమాచారం అందివ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన అధికారులను ప్రశ్నించారు. కొన్ని గ్రామాల్లో అసలు ఒక్కరినైనా ఎంపిక చేయకపోవడం, సమాచారం కూడా ఇవ్వక పోవడంపై ఆరా తీశారు. ఇలా అయితే వారు ఏవిధంగా పనులు చేస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



పాలకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఎక్కడైతే అక్రమ కట్టడాలు ఉన్నాయో, వాటికి వెంటనే నోటీసులు అంటించి, తొలగించే చర్యలు చేపట్టాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సూచించారు. గురువారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎర్రకంచమ్మ, ఇప్పలపొలమ్మ అమ్మవార్ల పండగలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ నాయకుల రిలే దీక్ష

బెలగాం, మే 15 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 3 స్థానంలో కొత్త చట్టం ఇచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఆదివాసీ జేఏసీ కమిటీ హెచ్చరించింది. గురువారం ఈ మేరకు జేఏసీ నాయకులు పార్వతీపురం ఐటీడీఏ ఎదుట రిలే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకు లు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని పోస్టులను మెగా డీఎస్సీ నుంచి మినహాయించాలని, ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఆదివాసీలను నియమించాలని కోరారు. షెడ్యూల్ ప్రాంతంలో ఉపాధ్యాయుల నియామక చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టం రూపొందించేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకు లు టి.జయన్న, ఎం.అమర్నాథ్, సూర్యనారాయణ, డి.సీతారాం, ఎం.చంద్రశేఖర్, రంజిత్, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చండి

పార్వతీపురం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పెదమరికి పంచాయతీ కొత్తఊరు గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందించారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో 42 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరో ఎనిమిదిమంది చేరబోతున్నారని తెలిపారు. ప్రభుత్వ 45మంది ఉన్న పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేస్తోందని, ఈ నేపథ్యంలో తమ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఆక్రమణలపై నిరవధిక దీక్ష



దీక్ష చేపడుతున్న దృశ్యం

పాలకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): కొండాపురంలోని గ్రామకంఠంతో పాటు శ్మశానవాటిక ఆక్రమణలను తొలగించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కరణం మురళీ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన గురువారం నిరవధిక దీక్ష చేపట్టారు. గ్రామంలోని సర్వే నెంబర్ 18/2లో ఉన్న గ్రామ కంఠంతో పాటు సర్వే నెంబర్ 20/4లో ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి అమ్మకాలు జరిపినట్టు పలుమార్లు ఉన్నతాధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీబీతో విచారణ జరిపించాల న్నారు. జీవో నెం.188 ప్రకారం గ్రామ కంఠం భూమిని ఎస్సీ వర్గానికి తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలు తొలగించే వరకు నిరవధిక దీక్ష చేపడతానన్నారు. ఆయనకు జనసేన నాయకుడు కనపాక సాయి, కూటమి నాయకులు మద్దతు తెలిపారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి

బలిజిపేట, మే 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా విధులు నిర్వహించని కార్యకర్తలు, ఆయాలపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీవో సులేఖ హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బలిజిపేట, సీతానగరం మండలాల అంగన్‌వాడీ సిబ్బందికి ఐసీడీఎస్ ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ సమయానికి కేంద్రాలు తెరవాలన్నారు. ఆహారం సూచిగా అందించాలని తెలిపారు. బాల సంజీవని ఆప్‌లో ఏం మార్పిన్లో ఏం చేయాలో వివరించారు. ఫేస్ యాప్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. బలిజిపేట మండలంలోని 94 సెంటర్లు, సీతానగరం మండలంలోని 84 సెంటర్లకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది హాజరయ్యారు.

మురుగునీటి మళ్లింపునకు చర్యలు

పార్వతీపురంటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన రహదారిలో వర్షపు నీరు, మురుగునీటి మళ్లింపునకు మున్సిపల్ ప్రజారోగ్య శాఖాధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు గురువారం ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ పకీరురాజు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పాతబస్టాండ్ కూడలి నుంచి ప్రధాన రహదారిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం వరకు గల కాలువల్లో పూడికలు తీయించారు. ఈసందర్భంగా పకీరురాజు మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంలో వర్షపునీరు నిలిచిపోకుండా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళిక ప్రకారం సిద్ధం అవుతున్నామన్నారు. అంతేకాకుండా పట్టణంలోని ఆయా వార్డుల్లో గల వీధుల్లోని మురుగునీరు మళ్లింపునకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే స్వచ్ఛంద్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

చెరువుల్లో మట్టి.. పొలాలకు

● ప్రభుత్వ ఆదేశాలు జారీ

దత్తిరాజేరు, మే 15(ఆంధ్రజ్యోతి): చెరువులు, జలాశయాల నుంచి పూడిక మట్టిని రైతులు తమ సొంత పొలాలకు తరలించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తహసీల్దార్ పి.విజయభాస్కర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి వనరుల మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వం దృష్టిపెట్టిందన్నారు. చెరు వులతో పాటు కాలువల్లో మట్టి, పూడిక తీయాలని నిర్ణయించిందన్నారు. అయితే ఈ మట్టిని రైతులు తమ సొంత పొలాలకు తరలించేందుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. రైతులు సొంత ఖర్చుతో పూడిక తీసుకుని ఆ మట్టిని వినియోగించుకోవచ్చన్నారు. దీనికి సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. చెరువులు, జల వనరుల గట్లపై ఈ పూడిక తీసిన మట్టిని నిల్వ చేయకూడదన్నారు. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్టు

బాడంగి, మే 15(ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలతో ఒక మహిళను అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. గురువారం పాల్తేరు గ్రామానికి చెందిన ఒక మహిళ 10 మద్యం సీసాలను కలిగి ఉండడంతో ఆమెను అరెస్టు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు.

సారా స్వాధీనం

కురుపాం, మే 10(ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామంలో అక్రమంగా సారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. అలాగే సారా సరఫరా చేసిన వారిపై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

సీతానగరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్యం దుకాణాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలని, అనధికార గొలుసు దుకాణాలు నిర్వహించరాదని తెలిపారు. ఆకస్మిక తనిఖీల్లో ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

సీతంపేట రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దేవనాపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎస్ఐ వై.అమ్మనరావు గురువారం ప్రారంభించారు. ఈ టోర్నీలో మొత్తంగా 50 టీంలు పాల్గొన్నాయి. పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

పాలకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ రత్నరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

రాయగడలో తిరంగ యాత్ర

ఒడిశా

రాయగడ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో 'పరాక్రమ్‌శోభ' పేరిట నిర్వహించిన తిరంగ యాత్రను కలెక్టర్ పారుల్ పట్వారి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ కూడలి వద్ద ప్రారంభమైన ఈ యాత్ర పట్టణమంతా సాగింది. అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్, రెండో అదనపు కలెక్టర్ నిహార్‌రంజన్ కహార్, డిప్యూటీ కలెక్టర్ రమేష్‌కుమార్ జెనా, ఐటీడీఏ పీవో చంద్రకాంత్ మాఝి, పురపాలక కార్యనిర్వాహణాధికారి కులదీప్ కుమార్, అన్ని కళాశాలల, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీడీవో ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో గల అన్ని సచివాలయాల కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మూడు సచివాలయాల్ని సందర్శించానని, కేవలం డిజిటల్ అసిస్టెంట్, పీఎస్ మినహా మిగతా సిబ్బంది కానరావడం లేదని అన్నారు. ఏదయినా సర్వేలకు వెళ్లేడప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లాలని, బయటకు వెళ్లేటప్పుడు ఎంపీడీవో అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినవారికి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 17వ తేదీన జరగబోవు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛా ఆంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, అలాగే 21వ తేదీన ఐఏఎస్ అధికారులు సచివాలయాల సందర్శన ఉంటుందని ఈలోగా అన్ని సర్వేలు పూర్తి చేయాలని, అందులో అందరూ హాజరు కావాలని, అందుకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అల్లు భాస్కరరావు, ఎంసీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీవో కిరణ్‌కుమార్

సమ్మెను జయప్రదం చేయాలి

పాలకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాలకొండలో గురువారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. అలాగే ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పాలకొండ ప్రాజెక్టు కమిటీ, ఏపీ ఆశ, సీహెచ్‌డబ్ల్యువో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి బి.అమరవేణి, ఆశ వర్కర్స్, సీహెచ్‌డబ్ల్యూ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కొల్లి గౌరీశ్వరి పాల్గొన్నారు. ● సీతానగరం: ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బల్లకృష్ణారాయిపురం, బగ్గందొరవలస గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

పార్వతీపురంటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయంఉపాధితో ఆర్థికంగా ఎదగాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గడ్డమ్మ అన్నారు. త్వరలో శ్రీటెక్నాలజీ నిర్వహించనున్న టైలరింగ్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను ఉద్దేశించి ఆమె గురువారం మాట్లాడారు. 90 రోజుల శిక్షణా కార్యక్రమంలో ప్రతి ఒక్క మహిళా నైపుణ్యాభివృద్ధిని సాధించాలన్నారు. శిక్షణానంతరం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.రాజేష్, ఏఈవో గోపి పాల్గొన్నారు.

● గరుగుబిల్లి: మండల కేంద్రంలో బీసీ సహకార ఆర్థిక సంస్థ సహకారంతో శ్రీటెక్నాలజీ సంస్థ నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డమ్మ గురువారం తనిఖీ చేశారు. జిల్లాలోని 15 మండలాల్లో అర్హులైన వారిని గుర్తించి కుట్టు శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. శిక్షణకు 75 శాతం హాజరు ఉన్నవారికే ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో గోపి, శ్రీటెక్నాలజీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గుల్ల రాజేష్ ఉన్నారు.

ప్రభుత్వ భవనాల పరిశీలన

పాలకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ భవన సముదాయాలను జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా గురువారం పరిశీలించారు. డీఎల్‌డీఏ కార్యాలయంతో పాటు దాని పరిధిలోకి డీఎల్‌పీవో, ఉపాధి హామీ ఏపీడీ కార్యాలయాల ఏర్పాటును పరిశీలించారు. పట్టణంలో వెంకంపేట ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ వసతిగృహాలను సందర్శించి అక్కడ ఎన్ని రూమ్‌లు ఖాళీగా ఉన్నాయి.. పొడవు, వెడల్పుల వివరాలు తెలుసుకున్నారు. డీఎల్‌డీవో గోపాలకృష్ణతో మాట్లాడి భవనాల పరిస్థితిపై చర్చించారు.

గిరిజన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

సీతంపేట రూరల్,మే 15(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన 137 మంది గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఈ ఏడాది 1,385 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వీరిలో బాలురు 88 మంది, బాలికలు 49 మంది ఫెయిలయ్యారు. వీరికి సీతంపేటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో వేర్వేరుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. వీరందరూ ఈనెల 19వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాయనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం, మే 15 (ఆంధ్రజ్యోతి): బూర్జ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు చేపట్టనున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ శశిభూషణరావు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● భామిని: మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కొత్తూరు నుంచి భామిని వరకు 33 కేవీ విద్యుత్‌లైన్‌లకు మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ చేయనున్న నేపథ్యంలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని చెప్పారు.

● గరుగుబిల్లి: మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ బడే శ్రీనివాసనాయుడు తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ నిర్వహణ పనుల కారణంగా గరుగుబిల్లి, ఉద్దవోలు, రావుపల్లి ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

రామభద్రపురం, మే 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బైపాస్ నుంచి బొబ్బిలి రోడ్డు వరకు ఉన్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. ఆక్రమణలకు గురైన షాపులను పూర్తిగా తొలగించారు. తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, సర్వేయర్ అక్కేన శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎన్నో దశాబ్దాల నుంచి ఈ రోడ్డు ఆక్రమణకు గురవ్వడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. ఇన్నాళ్లకు ఈ ఆక్రమణల తొలగింపు చేపట్టడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు ప్రత్యేక దృష్టిసారించారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

